క్లుప్తంగా

అందరికీ మెరుగైన వైద్యం అందించాలి

జడ్జి జయలక్ష్మి



దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో స్పందన మానసిక వికాస కేంద్రంలో శుక్రవారం జిల్లా లీగల్ సర్వీస్ ఆథారిటీ ఆదేశాల మేరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దఅవుటపల్లి పీహెచ్‌సీ డాక్టర్ సుజాత నేతృత్వంలో దివ్యాంగులైన విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరాన్ని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సబ్‌కోర్టు జడ్జి కే జయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అందరికీ మెరుగైన వైద్య సేవలందించాలనే ఆశయంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దివ్యాంగులైన విద్యార్థులు తయారు చేసిన బొకేలు, గాజులను పరిశీలించారు. విద్యార్థుల సృజనాత్మకతను అభినందించారు. వికాస కేంద్రం కార్యదర్శి సంకాబత్తుల రజిత, పలువురు ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ధాన్యం తరలింపునకు వాహనాల ఏర్పాటు



పెనమలూరు: గంగూరులో ఆరబెట్టిన ధాన్యాన్ని మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ రైతులకు ధాన్యం తరలింపునకు వాహనాలు ఏర్పాటు చేస్తామన్నారు. 1262 రకం ధాన్యం కూడా రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నారన్నారు. ధాన్యం వాహనాలలో తరలించే సమయంలో వాహనాన్ని పీపీసీ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. రైతులు మాట్లాడుతూ సకాలంలో ధాన్యం తరలింపునకు రవాణా సమస్య ఏర్పడుతుందన్నారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు వీఏఏ జమీల అంజు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ




పెనమలూరు: కాకినాడ జేఎన్‌టీయుకే నిర్వహించిన యోగా పోటీల్లో కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన విద్యార్థులు గెలిచి జాతీయ పోటీలకు అర్హత సాధించారు. కాకినాడలో 3, 4 తేదీల్లో జరిగిన యోగా పోటీలలో కాలేజీకి చెందిన బి.ఈశ్వరి, టి.దుర్గాజగదీష్, జి.వసుంధర సత్తాచాటారు. వీరిని జేఎన్‌టీయుకే జట్టుకు కూడా ఎంపిక చేశారు. భువనేశ్వర్‌లో ఈ నెలలో జరుగు జాతీయ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో వీరు పాల్గొంటారు. ఈ సందర్భంగా కాలేజీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు అభినందించారు. యోగా మాస్టారు మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

ఉయ్యూరు: గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గండిగుంట పంచాయతీ పరిధిలో ధరణి, విభ అపార్టుమెంట్లు వద్ద రూ. 34 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ పల్లెల్లో రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సర్పంచ్ గెత్తం అనుపమ, మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, ఎంపీడీఓ శేషగిరిరావు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ హెచ్‌ఎంకే హైస్కూల్



కంకిపాడు: కైవల్య– 2కే24లో గోసాల హెచ్‌ఎంకే హైస్కూల్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. సత్తా చాటిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ ఆర్.వసంతకుమార్, ప్రిన్సిపాల్ సుక్‌మిత్ కౌర్ శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమి ఈనెల 5న నిర్వహించిన కై వల్య–2కే24లో పలు విభాగాల్లో పాఠశాల విద్యార్థులు రాణించారన్నారు. సైన్స్ ఎక్స్‌పోలో పదో తరగతి విద్యార్థులు రోబోను ప్రదర్శించి మొదటి బహుమతి అందుకున్నారన్నారు. పవర్ ప్లాంట్ ప్రజెంటేషన్, వ్యాసరచన, నృత్య ప్రదర్శనలో తొమ్మిదో తరగతి విద్యార్థిని వై.నిరుపమ రెండో బహుమతి సాధించిందన్నారు. పాటల పోటీల్లో పి.సన్నిహిత మొదటి బహుమతి, గ్రూప్ డ్యాన్స్‌లో విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారన్నారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ దక్కిందన్నారు.

అటకెక్కిన పారిశుద్ధ్యం

పట్టించుకోని పంచాయతీ అధికారులు



ఎస్సీ కాలనీ సమీపంలో నివాసాల మధ్య చెత్తకుప్పలు

రామవరప్పాడు: నగరానికి కూతవేటు దూరంలో విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో ఉన్న పారిశుద్ధ్య సమస్య పట్టి పీడిస్తోంది. ప్రధాన గ్రామంతో పాటు అంతర్గత రహదారుల్లో చెత్త కుప్పలు చిన్న సైజు గుట్టలుగా పేరుకుపోతున్నా పంచాయతీ అధికారులకు పట్టడం లేదు. పరిసరాలు శుభ్రంగా ఉంచుతున్నాం, చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామంటూ ఊదరగొట్టడం తప్ప పరిష్కార మార్గాలు మాత్రం చూపడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

అధ్వానంగా డ్రెయిన్లు..

గ్రామంలోని పలు అంతర్గత రహదారుల్లో డ్రెయిన్లు అధ్వానస్థితికి చేరుకున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో మురుగునీరు పొంగి రహదారులపైకి చేరుకుంటోంది. పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పుకుంటున్న పంచాయతీ అధికారులు ఆ దిశగా ప్రగతి సాధించలేకపోతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇష్టారాజ్యంగా చెత్తడంపింగ్..

చెత్త డంపింగ్ చేయడానికి అనువైన స్థల కొరతతో ఈ సమస్య కాస్తా పరిష్కారం కాని సమస్యగా తయారైంది. దీంతో గ్రామంలో పలు చోట్ల ఇష్టారాజ్యంగా చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దీంతో అంతర్గత రోడ్లు, ప్రధాన రహదారుల వెంట చెత్త డంపింగ్ కేంద్రాలు వెలుస్తున్నాయి. ఆయా రోడ్లపై రాకపోకలు సాగించే వారికి ఆటంకంగా మారుతుంది.

ప్రధాన ప్రాంతాలకే పరిమితం

గ్రామంలో నిర్వహించే పారిశుద్ధ్య, అభివృద్ధి పనులు ప్రధాన ప్రాంతాలకే పరిమితం అవుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. యాదవుల బజారు, సెయింట్ ఆన్స్ పాఠశాల వీధి, ఎస్సీ కాలనీ వంటి పలు ప్రాంతాల్లో సమస్యలు మేట వేసినా అధికారులు, పాలకులకు పట్టడం లేదు. ముఖ్యంగా నివాసాల మధ్య ఉన్న పలు ఖాళీ స్థలాలు పాములు, పురుగులు చేరి ప్రమాదకరంగా మారాయి. వీటిపై పంచాయతీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చోద్యం చూస్తున్న అధికారులు

గ్రామంలో రహదారుల పక్కనే చెత్త డంపింగ్‌లు వెలుస్తున్నా పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లుగా ప్రవర్తిస్తున్నారు. పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యాలయానికి అనేక ఫిర్యాదులు వస్తున్న తప్పించుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పూడిక తీయటం లేదు..

డ్రెయిన్లు అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. డ్రెయిన్లలో పూడిక తీయకపోవడంతో మురుగునీరు పారుదల సజావుగా ఉండటం లేదు. మురుగునీరు రోడ్లపైకి చేరుకుంటోంది. పారిశుద్ధ్య నిర్వహణపై కాల్వగట్టు ప్రాంతాల్లో పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది.

– సాదం వెంకటేశ్వరరావు, ప్రసాదంపాడు

చర్యలు తీసుకుంటాం..

గ్రామంలో ఖాళీ స్థలాలను గుర్తించి నోటీసులు జారీ చేస్తాం. పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగు పరచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. గ్రామంలో పలు ప్రాంతాల్లో నివాసాల మధ్య చెత్త డంపింగ్ చేయకుండా ప్రజలకు అవగాహన పరుస్తున్నాం. పారిశుద్ధ్య సిబ్బందిచే చెత్తను తొలగింపజేస్తున్నాం. సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను పూడిక తీయిస్తున్నాం.

– రాజేంద్రప్రసాద్, కార్యదర్శి, ప్రసాదంపాడు

ఆత్మీయ కలయిక



కంకిపాడు: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్ శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు రాష్ట్ర కమిటీలో చోటు కల్పించినందుకు వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం పనిచేసే, కష్టపడే వ్యక్తులకు ప్రాధాన్యత ఉంటుందని జగన్ సూచించారని ప్రణీత్‌కుమార్ తెలిపారు. అధినేత సూచనలకు అనుగుణంగా పార్టీ కార్యక్రమాలను గ్రామాల్లోకి తీసుకెళ్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ పిలుపు మేరకు పని చేస్తామన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఉయ్యూరు: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆపద సమయంలో పేద వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. చికిత్స చేయించుకున్న ఆరుగురికి సీఎం సహాయనిధి నుంచి రూ.20.42 లక్షలు మంజూరైంది. చెక్కులను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు.

దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

రామవరప్పాడు: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. విజయవాడ రూరల్ మండలం నున్నలోని బోడపాడు వద్ద శుక్రవారం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ న్యాయం, సమానత్వం ఆధారంగా సమాజ నిర్మాణానికి అంబేడ్కర్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన దార్శనికత, విలువల నుంచి మనమంతా స్ఫూర్తి పొందాలన్నారు. మాజీ సర్పంచ్ కర్రె విజయ్‌కుమార్, ఉప సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి, దండు సుబ్రహ్మణ్య రాజు, సాంబిరెడ్డి, పెయ్యల రజిని తదితరులు పాల్గొన్నారు.



నున్నలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



గన్నవరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మురళి

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ పార్కులో విగ్రహానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ నేతృత్వంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఆగిరిపల్లి రోడ్డులోని విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పుష్పాంజలి ఘటించారు. న్యాయవాదులు అమర్తల సోమేశ్వరరావు, ప్రకాశరావు, గారపాటి రవి, విమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కేసరపల్లిలోని అంబేడ్కర్ విగ్రహానికి వైస్ ఎంపీపీ– 2 కాలగడ్డ శివనాగరాజకుమారి, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక నివాళులర్పించారు. వార్డు సభ్యులు పాగోలు సునీల్, పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే రాజ్యాధికారం సాధ్యం

కంకిపాడు: ఐక్య ఉద్యమాల ద్వారానే రాజ్యాధికారి సాధ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు కంకిపాడులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. కంకిపాడు సర్పంచ్ బాకీ రమణ, జేసీఎస్ మాజీ చైర్మన్, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అగ్రిబోర్డు మాజీచైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బందెల సుబ్బారావు, సీహెచ్‌సీ మాజీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, ఎంపీటీసీ తోకల ఉమాదేవి, పార్టీ నేతలు కలపాల వజ్రాలు, చుండూరు మోహన్‌రావు, జోజ్‌మేరీ, తాళ్లూరి మరియబాబు, అసిలేటి సురేష్, కలపాల ప్రభాకర్, కొఠారి సాంబశివరావు, కరీముల్లా, చంటి, శివ, మల్లు పాల్గొన్నారు.

ఉయ్యూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం ఉయ్యూరులో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శేషగిరిరావు, ఏఓ లోయ శివశంకర్, విద్యుత్ శాఖ కార్యాలయంలో ఈఈ కృష్ణనాయక్, అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం కార్యాలయం, పట్టణంలోని ఐదో వార్డులో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.

పెనమలూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కానూరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ స్వేచ్ఛ, సమానత్వం కోసం ఎంతో కృషి చేశారన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు అభివృద్ధి సాధించటానికి అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే కారణమని తెలిపారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు చక్క గోపి, నంబూరు ప్రసాద్, చుండూరు శేఖర్, నల్లూరు శాంతిరాజు, అన్వర్, నేతలు పాల్గొన్నారు.



కేసరపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక బాపులపాడులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ శరత్‌బాబు, స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, దళిత నాయకులు దాసరి బెనర్జీ పూలమాల వేసి నివాళి అర్పించారు. గాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు.



కంకిపాడులో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..



కానూరులో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి



బాపులపాడులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

పెనమలూరు: రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారం చేస్తామని తహసీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. యనమలకుదురులో శుక్రవారం రెవెన్యూ సదస్సులను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. భూ క్రయ విక్రయాలు, పార్టీషన్లు, వారసుల పేర్లు రెవెన్యూ రికార్డులలో నమోదు చేస్తామన్నారు. నీటి తీరువా డిమాండ్ సరి చేయటం, సర్వే నంబర్లు తప్పుగా ఉంటే సరిద్దిటం ఇలా అనేక సమస్యలు రెవెన్యూ సదస్సుల్లో తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భరద్వాజ్, వీఆర్వోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



యనమలకుదురులో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ



బల్లిపర్రులో అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దారు శివయ్య

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి గ్రామ శివారు బల్లిపర్రులో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. డీడీవో వి.సుజాత ఆధ్వర్యంలో తహసీల్దారు కేవీ శివయ్య పాల్గొని రెవెన్యూ సదస్సులను ప్రజలు ఉపయోగించుకోవాలని చెప్పారు. రైతుల వద్ద 25 అర్జీలను స్వీకరించారు. వీఆర్వోలు రమ్య, కేవీ గోపాలరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కంకిపాడు: రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ వీ భావనారాయణ అన్నారు. మండలంలోని మారేడుమాక గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 16 మంది అర్జీలు స్వీకరించారు. వీటిలో 12 అర్జీలు పట్టాదారు పాసుపుస్తకాల కోసం కాగా, మూడు అర్జీలు సర్వేకి, ఆర్ఓఆర్‌కు ఒక అర్జీ అందాయి. డెప్యూటీ తహసీల్దార్ ఏ శ్రీనివాసరావు, సర్పంచ్ సీహెచ్ ఆదర్శకుమార్, పలువురు రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని సాయిపురంలో రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నుంచి ఏడు అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలుతీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు. సర్పంచ్ షేక్‌జాన్ బాషా, ఆర్ఐ యతీంద్ర, పాల్గొన్నారు.



మారేడుమాకలో సమీక్ష చేస్తున్న తహసీల్దార్ భావనారాయణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక బాపులపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు యార్లగడ్డతో పాటు జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ హాజరయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యార్లగడ్డ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులే అర్జీలు స్వీకరించేందుకు ప్రత్యేకంగా సదస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డీపీవో అరుణ మాట్లాడుతూ రైతులకు అర్జీ రాసేందుకు సచివాలయ ఉద్యోగులు సాయం అందించాలని సూచించారు. తహసీల్దార్ వి.నాగభూషణం, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

చెక్‌లిస్టులో అంశాలపై చర్చించండి

గన్నవరం: చెక్‌లిస్ట్‌లో ఉన్న అన్ని అంశాలను తల్లిదండ్రులకు తెలియజేయడంతో పాటు చర్చించాలని, తల్లిదండ్రులు, టీచర్స్ సమావేశాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ టి.స్వర్ణలత సూచించారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పీటీఎం సమావేశాలకు ఎక్కువ మంది తల్లిదండ్రులు హాజరయ్యే విధంగా హెచ్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. ఎంఈఓ–1 కొండా రవికుమార్ మాట్లాడుతూ సమగ్ర ప్రగతి పత్రంలోని విద్యార్థుల ప్రతిభ, హాజరు శాతాన్ని, అందులోని అంశాలను తల్లిదండ్రులకు వివరించాలని చెప్పారు. సమావేశం అనంతరం విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనం చేయాలని తెలిపారు. ఎంఈఓ– 2 ఎం.కమల తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ, ఎంఈఓలు

కంకిపాడు: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో శనివారం మెగా పీటీఎంను ఘనంగా నిర్వహించాలని ఎంఈఓ–2 కేఎస్‌వీ ప్రసాద్ సూచించారు. కంకిపాడు లాకుగూడెం పాఠశాలలో ఉపాధ్యాయులతో శుక్రవారం సమీక్ష నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. తల్లిదండ్రులకు ఘనంగా స్వాగతం పలికి విద్యార్థుల ప్రగతి నివేదికను అందించాలన్నారు. ఆసక్తిగల తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు, తాడు లాగుడు పోటీలు నిర్వహించాల్సి ఉందన్నారు. నిబంధనల మేరకు సమావేశాన్ని నిర్వహించాలని స్పష్టంచేశారు.

పరిశ్రమలు స్థాపించి లక్ష్యం చేరుకోవాలి

ఉంగుటూరు: నైపుణ్య శిక్షణ పొందినవారు పరిశ్రమలు స్థాపిస్తే లక్ష్యాలను చేరుకుంటారని రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్య తరగతి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.సురేంద్రబాబు అన్నారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఎలీప్ ఇండియా సీఈడీ అగ్రిక్లినిక్, అగ్రి బిజినెస్ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ముఖ్యఅతిథి సురేంద్రబాబు శిక్షణ పొందినవారికి పలు సూచనలు చేశారు. చిన్న పరిశ్రమలను స్థాపించే వారికి ప్రభుత్వం రుణసదుపాయాన్ని అందజేస్తోందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని పేర్కొన్నారు. నాణ్యతతో కూడిన ఆహార ఉత్పత్తుల తయారీ పరిశ్రమలను స్థాపించి రైతులకు అండగా నిలబడాలని ఆకాంక్షించారు.



ధ్రువీకరణ పత్రాలు అందుకున్నవారితో సురేంద్రబాబు

శిక్షణ పూర్తి చేసినవారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సిద్ధార్థ మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, కో ఆర్డినేటర్ నళిని మైనేని, నోడల్ ఆఫీసర్ శోభారాణి, ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి పాల్గొన్నారు.

భూకేటాయింపుపై 'రెవెన్యూ' కొత్త పాట!

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలో సామాజిక అవసరాల నిమిత్తం చేసిన భూకేటాయింపుపై మరోమారు వివాదం రాజుకుంది. ఈ భూముల్లో రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు సర్వే నిర్వహిస్తుండటంతో గ్రామస్తులు పదేపదే అడ్డుపడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కూడా రెవెన్యూ అధికారులు దిగొచ్చి ప్రత్యామ్నాయ స్థలకేటాయింపు చేస్తామని గ్రామస్తులకు పలు స్థలాలను చూపించారు. మల్లవల్లిలోని ఆర్ఎస్ నంబర్ 11లోని 1460 ఎకరాల రెవెన్యూ అటవీ భూమిని పారిశ్రామిక అవసరాల కోసం 2016లో నాటి టీడీపీ ప్రభుత్వం సేకరించింది. ఆ తరుణంలో గ్రామ సామాజిక అవసరాలు, పేదల ఇళ్ల స్థలాల పంపిణీ నిమిత్తం 100 ఎకరాలను కేటాయిస్తూ ప్రత్యేక జీవోను జారీ చేశారు. దీంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో ఈ భూమిలో జెడ్పీ హైస్కూల్ నిర్మాణం, ఇళ్ల స్థలాల లే అవుట్ చేపట్టగా, మిగిలిన 82 ఎకరాలను తిరిగి టీడీపీ ప్రభుత్వం ఏపీఐఐసీకి అప్పగించేందుకు గుట్టుచప్పుడు కాకుండా ప్రక్రియ మొదలుపెట్టింది. ఈ భూముల్లో రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టడంతో అనుమానం వచ్చిన గతంలో పలుమార్లు రైతులు అడ్డుకున్నారు. దీంతో గ్రామానికి కేటాయించిన వంద ఎకరాల భూమి ఇది కాదని, మరోచోట ఉందంటూ రెవెన్యూ అధికారులు వితండవాదం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ వి.నాగభూషణం, మండల సర్వేయర్ ఫణికుమార్ మల్లవల్లి గ్రామస్తులకు ఆర్ఎస్ నంబర్ 11లో మరోచోట సామాజిక అవసరాలకు భూమి కేటాయించేందుకు ప్రత్యామ్నాయ ప్రదేశాలను చూపించారు. దీనిపై గ్రామస్తులు ఏకాభిప్రాయానికి రాకపోవటంతో అర్థాంతరంగా నిల్చిపోయింది.



మల్లవల్లిలో గ్రామస్తులతో చర్చిస్తున్న తహసీల్దార్ నాగభూషణం

ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు

కోర్టు స్టే బేఖాతర్

పెనమలూరు: కూటమి ప్రభుత్వం పాలనలో చట్టాలు, న్యాయస్థానాల ఉత్తర్వులతో పని లేకుండాపోయింది. పెదపులిపాక ఇసుక క్వారీపై హైకోర్టు స్టే ఉన్నా ఇసుక మాఫియా అక్రమ ఇసుక తవ్వకాలు చేపడుతోంది. పెదపులిపాక ఇసుక క్వారీపై గతంలో హైకోర్టు ఇసుక తవ్వకాలు చేయరాదని ఉత్తర్వులు ఇచ్చింది. గ్రామానికి చెందిన వ్యక్తులు ఇసుక తవ్వకాలు చేయటం వలన భూగర్భజలాలు లేకుండా పోతున్నాయని కోర్టును ఆశ్రయించటంతో ఈ మేరకు కోర్టు స్టే ఇచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇసుక క్వారీలో కొందరు వ్యక్తులు అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. ఇసుక తవ్వకాలపై గ్రామస్తుల నుంచి వచ్చిన సమాచారంతో పలువురు మీడియా ప్రతినిధులు ఘటనా స్థలంలోకి వెళ్లగా ఇసుక మాఫియా అక్కడి నుంచి వెళ్లి పోయారు. అధికారులు కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కారును ఢీకొట్టిన లారీ

కారు డ్రైవర్‌ను రక్షించిన స్థానికులు

పెనమలూరు: విజయవాడ– మచిలీపట్నం జాతీయ రహదారి గంగూరు సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదం కారణంగా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. విజయవాడ నుంచి కంకిపాడు వైపునకు వెళుతున్న కారును వెనుక వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో లారీ కారును రోడ్డు మీద ఈడ్చుకు వెళ్లింది. కారు నడుపుతున్న వ్యక్తి కారులో ఇరుక్కుపోయాడు. స్థానికుల సహకారంతో అతనిని బయటకు తీశారు. రెండు వాహనాలు రోడ్డుపై అడ్డుగా ఉండిపోవటంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.